www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 జులై 2025
5
అన్నమయ్య



సమ్మెను జయప్రదం చేయండి


ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఆదివారం నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఆఫీస్ యేషన్ గౌరవాధ్యక్షుడు శంకరయ్య కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆవరణంలో కార్మికులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు 23 రోజులుగా వివిధ రకాలుగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. 24 గంటల శ్రమిస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్మికులు చేపట్టిన సమ్మెను ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు రాజకీయ నాయకులు అర్థం చేసుకుని సహకరించాలన్నారు. విద్యుత్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఖరీఫ్ సాగు ఖతం..!



కాటిమాయకుంట దగ్గర ఖాళీగా ఉన్న బీడు భూములు

జాడ లేని వానలు | సాగుకు నోచని భూములు | రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- రాయచోటి

ఈ ఏడాదిలో వర్షాభావం ఖరీఫ్ సీజన్‌ను ముంచేసింది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ ప్రారంభం నుంచి తగినంత వర్షాలు కురవలేదు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 5,54,96 హెక్టార్లు ఉండగా ఇప్పటివరకు కేవలం 2,138 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంటను సాగు చేశారు. వేరుశనగ విత్తనాలు 34 వేల క్వింటాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు ఖరీఫ్‌లో 10 శాతం సాగు చేయాల్సి ఉండగా కేవలం 5 శాతం మాత్రమే రైతులు సాగు చేశారు. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసే వర్షాలే ఖరీఫ్ సీజన్ పంటలకు ప్రాణాధారం. జూన్, జూలై మాసాలలో కూడా ఎండలు మండి పోతున్నాయి. దీంతో ఖరీఫ్ పంటలు సాగు కావడం లేదు. ఏప్రిల్, మే నెలలో కాస్త వర్షం పడినప్పటికీ పంటల సాగుకు అవసరమైన అంతగా నేల తడవలేదు. ఎండలు మాత్రం మండిపోతున్నాయి. దీంతో వ్యవసాయ శాఖ జిల్లాలో సాగు నాలుగో వంతుకు పడిపోయింది. ఈ సంవత్సరం జూన్ 15 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. జూన్, జూలై మాసాలలో జిల్లాలో వర్షం పాతం నమోదు కాలేదు. ఈనెల 15లోపు వేరుశనగ విత్తనాలు వేయడానికి సరైన అదును సమయం. ఇప్పటివరకు విత్తనాలను వేసుకున్న రైతులకు మాత్రమే ఆశించిన మేర పంటలు దిగుబడి వస్తుంది. జిల్లాలో జూన్ మాసం నుండి సరైన వర్షాలు కురవక పోవడంతో జిల్లా వ్యాప్తంగా బీడు భూములు, కాలి చెరువులతో దర్శనమిస్తున్నాయి.



పాత రాయచోటిలో నీరు లేకుండా ఖాళీగా ఉన్న చెరువు

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



వేరుశనగ విత్తనాలు తెచ్చుకొని పొలాలను దుక్కు చేసుకొని వర్షం కోసం గత నెల నుంచి ఎదురు చూస్తున్నాం. నాలుగైదు సంవత్సరాలుగా వేరుశనగ పంట దిగుబడి లేదు. వర్షాలు కురుస్తాయని ఆశతో పొలాల్లో దుక్కులు చేసుకున్నాం. వర్షం కురిస్తే పంటలు పండి మా ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వ స్పందించి రైతులను ఆదుకోవాలి.

-మారుతి శంకర్, రైతు, మాధవరం, రాయచోటి.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెల రోజులు పూర్తయింది. నెల రోజుల నుండి జిల్లాలో వర్షం రాకపోవడంతో కనీసం పొలాలను దుక్కి చేసుకోవడానికి కూడా వీలు కాలేదు. గత నాలుగు సంవత్సరాలుగా రైతులు సరైన వర్షాలు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

- ఎన్ .రామచంద్ర, జిల్లా కార్యదర్శి ఏపీ రైతు సంఘం,రాయచోటి.

వేరుశనగ వేసుకోవచ్చు



ఈనెల చివరి వరకు వేరుశనగ విత్తనాలు రైతులు వేసుకోవచ్చును. ప్రస్తుతం వాతావరణం ఉక్కపోతగా ఉంది. కాబట్టి రెండు, మూడు రోజులలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతుల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- జి.శివన్నారాయణ జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.

స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలను వ్యతిరేకించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వ విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సి.రవికుమార్ అధ్యక్షతన జిల్లా పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల మీద ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి మోపుతున్న విద్యుత్ సర్దుబాటు ఛార్జీ భారం రూ.842 కోట్లను ఉపసంహరించుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపల ప్రభుత్వం రూ. 15485 కోట్లు అదనపు భారం మోపిందన్నారు. ప్రజల నుండి వసూలు చేసిన 2రూ. 873 కోట్లను వెంటనే వారికి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనిట్‌కు నలభై పైసలు వసూలు చేస్తున్న విధానాన్ని ఆగస్టు నుండి నిలిపివేయాలన్నారు . విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని తెలిపారు. విద్యుత్ 2022 సవరణ చట్టంలో భాగంగానే పాలకులు విద్యుత్ రంగంను ప్రయివేట్, కార్పొరేట్ల జేబుల నిపండానికి కృషి చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్ల పగలగొట్టండి అని పిలుపునిచ్చిన లోకేష్ వేగంగా స్మార్ట్ మీటర్ల అమలులోకి తెస్తుండడం ప్రజానీకానికి చేస్తున్న అతి పెద్ద ద్రోహంగా పరిగణించాలాంటూ పిలుపు నిచ్చారు. రాబోయే కాలంలో స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ప్రజలకు మద్దతుగా అన్ని ప్రజాసంఘాలు, పార్టీలు పోరాటాలు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే రెండు వారాల్లో జిల్లా లో 15 మండలాలు , మున్సిపాల్టీలలోని 22 వార్డులు, 8 గ్రామాల్లో విద్యుత్ ఛార్జీలు పెంపు వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సచివాలయాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రచార, ఆందోళన కార్యక్రమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ. రామాంజులు డి. వెంకట్రామయ్య శాఖా కార్యదర్శులు మాధవయ్య వెంకటాచలపతి, భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవి భాగ్యమ్మ సభ్యులు ఈశ్వరయ్య శివరాం ప్రసాద్, శ్రీరాములు, గౌరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

తాళ్లపాకకు మహర్దశ

పలు అభివృద్ధి పనులకు టిటిడి అధికారుల ప్రతిపాదనలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పద కవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధికి పట్టనుందని టిటిడి ఆర్అండ్‌బి ఎస్‌సి మనోహర్ పేర్కొన్నారు. తాళ్లపాక గ్రామానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు, తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య కుమారుడు ఉద్దండం సుబ్రహ్మణ్యం పాలకమండలి సభ్యులు ఈనెల ఏడున టిటిడి జెఇఒ శ్యామలరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన స్పందించి అధికారులను పంపించారు. వారు శనివారం తాళ్లపాకను సందర్శించి తాళ్లపాకలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు తయారు చేసేందుకు పరిశీలించారు. తాళ్లపాక ముఖద్వారం నుంచి గ్రామం వరకు రోడ్డును విస్తరించేందుకు కొలతలు మేరకు రహదారి మధ్యలో డివైడర్ వేసి, ఒక్కోపక్క ఏడు మీటర్లు చొప్పున రోడ్డును విస్తరించేందుకు అంచనాలు సిద్ధం చేశారు. రోడ్డుకు ఇరువైపులా అన్నమయ్య నడియాడిన ప్రాంతంలో పేరెన్నిక గల కవుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు స్థానికులతో చర్చించి కొంతమంది కవుల పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం తాళ్లపాక మొదటి చెరువులో శివలింగాన్ని, అన్నమయ్య పద కవితలు రాస్తున్నట్లుగా విగ్రహాలను ఏర్పాటు చేసందుకు అంచనాలు తయారు చేశారు. చివరగా అన్నమయ్య ధ్యాన మందిరానికి చేరుకుని ధ్యాన మందిరవం నూతన కళ్యాణ వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కుమారుడు ఉద్దండం సుబ్రహ్మణ్యం శివ కేశవుల కల్యాణ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు వస్తున్నారని, వేదిక ఎంత మాత్రం సరిపోలేదని అధికారులకు సూచించడంతో స్పందించిన టిటిడి అధికారులు విస్తరింపజేసేందుకు అంచనాలు తయారు చేశారు. వాస్తుకు విరుద్ధంగా నిర్మించిన మరుగుదొడ్లను తొలగించి వాటిని వేరొక ప్రదేశంలో నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాళ్లపాక గ్రామస్తులు జవ్వాజి మోహన్ రావు, సుదర్శన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.



తాళ్లపాకలో పర్యటిస్తున్న టిటిడి అధికారులు

షమీం అస్లాంకు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సామాజిక సేవల విభాగంలో మదనపల్లె పట్టణానికి చెందిన మాజీ ఎపిఎండిసి చైర్ పర్సన్, వైసీపీ మహిళా నాయకురాలు షమీం అస్లాంకు భారత్ వర్చువల్ యూనివర్సిటీ పర్ ఫీస్ అండ్ ఎడ్యుకేషన్ డాక్టరేట్ ప్రకటించింది. శనివారం కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఎజె హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె యూనివర్సిటీ ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు .ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ షమీం అస్లాం అటు రాజకీయాల్లోనూ, ఇటు సేవా కార్యక్రమాలలో విశేషమైన సేవలు అందిస్తున్నారన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ఏడాది పాలన మోసాల మయంగా మారిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణం ఎస్.ఎన్.కాలనీలోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో రాయచోటి మున్సిపాలిటీ వైఎస్ఆర్ సిపి కమిటీలు, అనుబంధాల విభాగాలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలతో 'చంద్రబాబు ష్యూరిటీ ..మోసం గ్యారంటీ .. చంద్రబాబూస్ రీకాలింగ్ మేనిఫెస్టో'పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి, జెడ్‌పి మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, పట్టణ అధ్యక్షుడు నవాజ్, పార్టీ నాయకులతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను మోసాగిస్తున్నారన్నారు. జగన్ చేస్తున్న పథకాలు కాకుండా అంతకు మించి ఇస్తానని.. జగన్‌కన్నా ఎక్కువ చేస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పారని, బాండ్లు ఇచ్చి ప్రలోభాలు పెట్టి ప్రజలను పచ్చి మోసం చేశారన్నారు. 'ఆడబిడ్డ నిధి', 'నిరుద్యోగ భృతి', 'అన్నదాత సుఖీభవ', 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేయలేదన్నారు. చంద్రబాబు పాలనతో ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎంత అనేది చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల రిబ్బన్ కూడా కట్ చేయకుండా అన్నీ అమలు చేశామని చంద్రబాబు చెబుతున్నారన్నారు. 'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' అనే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. వైసిపికి కేడర్‌కు, అభిమానులుకు సంక్షేమ కార్యక్రమాలను విస్తరించవద్దని టిడిపి నాయకులు చెపుతున్నారని , కానీ వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు, వారి రాజకీయాలతో సంబంధాలు లేకుండా అర్హతే ఆధారంగా ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందాయని గుర్తు చేశారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలు వస్తాయన్నారు. అంతే కాకుండా చంద్రబాబు చేసిన దగా, పచ్చి మోసం వివరాలు కూడా వస్తాయన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేఖత వచ్చిందని అన్నారు. ప్రభుత్వ మోసాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజర్ రెహమాన్, జెడ్ పి టి సి వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్ సిపి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాష, పట్టణ మాజీ అధ్యక్షుడు రియాజర్ రెహమాన్, జాకీర్, ఎస్‌పిఎస్. రిజ్వాన్, జిన్నా షరీఫ్, మాజీ ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాడ్డి, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, కౌన్సిలర్లు కొలిమి ఛాన్‌బాష, సాదిక్, షబ్బీర్, గౌస్ ఖాన్, రౌనక్, ఫయాజ్ అహమ్మద్, ఇర్ఫాన్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మహేష్ రెడ్డి, మసాపేట వాల్మీకి సంఘ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు,గువ్వల జగదీష్,గువ్వల జగన్, శాతవాహన సంఘ అధ్యక్షుడు నాగేంద్ర,రొటేరియన్ హుసేన్,సుబ్బారెడ్డి, ఖలీల్ పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

రాయచోటి డిపోను మరింత అభివృద్ధి చేద్దాం

- ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమస్యలు లేని డిపోగా రాయచోటి డిపోను అభివృద్ధి చేస్తానని, బస్సుల ఆక్యుపెన్సీని పెంచే విధంగా చర్యలు తీసుకుని డిపోను తీర్చిదిద్దుతానని ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి ఇన్‌ఛార్జి డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ రాయచోటి డిపో పరిధిలో ఉన్న బస్సు సర్వీసులను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ప్రజల అవసర నిమిత్తం ఏర్పాటు చేసి, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేని సర్వీసులను సమయపాలన పాటిస్తూ ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యాన్ని చేరే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుదీర్ఘ ప్రయాణ బస్సు సర్వీసులను పెంచేందుకు కృషి చేస్తానని, ఆర్టీసీ బస్టాండ్‌లను ప్రజలందరూ తమ సొంత గృహంలా భావించి పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆర్‌టిసి సంపదను కాపాడేందుకు సహకరించాలని కోరారు. రాయచోటి డిపోలో ఉన్న మౌలిక సదుపాయాలు, సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. దూరప్రంతా ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశామని కావున ప్రయాణికులు సద్వినిగం చేసుకోవాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- రాయచోటి

రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర పేరొన్నారు. శనివారం పట్టణం లోని కొత్తపేట బిటిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రవేశపెట్టిన మనబడి మన భవిష్యత్తు కార్యక్రమం, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం ,ఇంటర్ విద్యార్థులకు కూడా రుచికరమైన మధ్యాహ్న బోజనం అందించడం సంతోషకరమన్నారు.సమాజ అభివృద్ధిలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు ప్రాధాన్యత ఉన్నాయని, అందులో ప్రభుత్వ విద్య చాలా గొప్ప పాత్రను పోషిస్తుందని చెప్పారు. విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవడంలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించే విధంగా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటికి బస్సులు పంపి విద్యార్థులను ఆకర్షిస్తున్నాయని, ఈ పోటీని తట్టుకొని ప్రభుత్వ పాఠశాలు మనుగడ సాధించాలంటే బడిని ఇంటి ముందటికి చేర్చే విధంగా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. అందులో భాగంగా ప్రతి ఉన్నత పాఠశాలకు మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ఆ పాఠశాల ఆవాస ప్రాంతాల నుండి పాఠశాలలకి పిల్లలను చేర్చే విధంగా ఐదు కిలోమీటర్ల ఆవాస ప్రాంతాన్ని పరిగణన లోకి తీసుకుంటూ బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. చాలా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల కొరత ఉందని, ఇంకా కొన్ని పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ సరఫరా చేయలేదని తెలిపారు. వాటిని అన్ని పాఠశాలలకు సరఫరా చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీరబల్లి మండల ప్రధాన కార్యదర్శి మదన్మోహన్ నాయక్, ఇతర బి టి ఏ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రచార కార్యదర్శి

న్యాయవ్యవస్థలో పోలీసుల పాత్ర కీలకం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : కోర్టులో ప్రదర్శించే నిబద్ధత నిజాయి వృత్తి నైపుణ్యం చాలా ముఖ్యమైందని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్‌పి ఎం వెంకటాద్రి అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కోర్టు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులకు సంబంధించి అన్ని చట్టపరమైన చర్యలపై నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. సమన్వయం, పర్యవేక్షణ కోసం చట్టపరమైన అనుసంధాన విభాగం రాష్ట్ర డిజిపి ఆదేశాలకు మేరకు సృష్టించిందని తెలిపారు. ఇందులో విచారణ లోని కేసులు, బెయిల్ దరఖాస్తులు అప్పీళ్లు, కోర్టు ప్రక్రియలు, ప్రాసిక్యూషన్‌కు సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఈ విభాగం ఎస్‌పి ప్రత్యేక పర్యవేక్షణలో చట్టపరమైన కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. జిల్లాలో జరిగే అన్ని కోర్టులలో కేసులు వాటి వివరాలు ఏ రోజుకు ఆ రోజు పోలీసు కార్యాలయానికి చేరాలని ప్రతిరోజు సమన్లు వారెంట్లు ఎన్ని తీసుకున్నారన్న సమాచారం ఉండాలన్నారు. వాటి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్జిమెంట్ కాపీ వచ్చినప్పుడు వాటి అప్పీళ్లకు వెళ్లేటకు కారణాలు తెలుసుకోవాలని సూచించారు. ముద్దాయిని అరెస్టు చేసినప్పుడు బెయిల్ రిమాండ్ వివరాల గురించి సంబంధిత అధికారులకు జిల్లా పోలీస్ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. న్యాయవ్యవస్థలో పోలీసులు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమైందని కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగడానికి కోర్టుల గౌరవాన్ని నిలబెట్టడానికి కోర్టు కానిస్టేబుళ్ల కృషి ప్రశంసనీయమన్నారు కేసులకు సంబంధించిన రికార్డులను పటిష్టంగా నిర్వహించడం చాలా కీలకమని విచారణ ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. కోర్టు కానిస్టేబుళ్లు తమ వృత్తిని గౌరవంగా భావించాలని న్యాయవ్యవస్థకు సమస్యలు ఎంతో విలువైనవి అని గుర్తు చేసుకోవాలని చెప్పారు. విధులలో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎస్‌పి కార్యక్రమంలో జిల్లా డిసిఆర్‌బి సిఐ ఎం.తులసీరామ్, జిల్లా లీగల్ లైసన్ యూనిట్ సిఐ ఆదినారాయణ రెడ్డి, ఎస్ఐ రవికుమార్, జిల్లా వ్యాప్తంగా కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీసులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఏకలవ్య' జాతీయ సదస్సు

ప్రజాశక్తి-పీలేరు : ఏకలవ్య లిటరరీ ఫౌండేషన్ జాతీయ సదస్సు విజయవంతంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. పీలేరు కేంద్రంగా పని చేస్తున్న ఏకలవ్య లిటరరీ రీసెర్చ్ ఫౌండేషన్ శనివారం స్థానికంగా భాష, సాహిత్యం, సాఫ్ట్ స్కిల్స్‌లో రూపుదిద్దుకుంటున్న ఆచరణలు, ఈపిఎల్ఎల్ఎస్-2025 అనే అంశంపై వర్చువల్ మాధ్యమం ద్వారా ఒక్కరోజు జాతీయ సదస్సు విజయవంతం నిర్వహించినట్లు తెలిపారు. దేశం నలుమూలల నుండి 85 మంది అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాయపూర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయబాబు సాహిత్య పరిణామాలపై వివరించారు. ప్లీనరీ స్పీకర్ గా గుజరాత్, ఎంకెబి యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్ బరాద్ భాషా నైపుణ్యాల ప్రాధాన్యతపై విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా వ్యవహరించిన మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. షాహీన్ మాట్లాడుతూ బాష, సాహిత్యం, సాఫ్ట్ స్కిల్స్ వంటి విభాగాల్లో జరుగుతున్న ఆధునిక పరిణామాలపై చర్చించేందుకు ఈ సదస్సును ఒక విద్యా వేదికగా ఏర్పాటు చేశామని అన్నారు.

శరాఘాతం!

ప్రజా'దృష్టి'

జిల్లాలో సార్వత్రిక సమ్మె అంచనాలకు మించి జయప్రదం కావడం అభినందనీయం. ఢిల్లీ నుంచి గల్లీ వరకు కార్మికలోకం ఒక్క తాటిపైకి వచ్చి ఉద్యమించడం పాలకులకు శరాఘాతంగా మారింది. కార్మిక నాయకత్వం పకడ్బందీ వ్యూహరచన చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనపై పట్టు బిగించాలి. 1886లో ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 29 లేబర్ కోడ్‌లను నాలుగు కోడ్లకు కుదించడం ఎంత తెంపరితనమో ఆలోచించాలి. కార్మికుల పని గంటలను పెంచడం ఏమిటో తెలియడం లేదు. కార్మికుల శారీరక, మానసిక ఆరోగ్యం, కుటుంబానికి సమయం కేటాయించడం వంటి మానవీయ హక్కుల గురించి ఆలోచించకపోవడం ఏమిటో అర్థం కాని పరిస్థితి. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేతనం చెల్లించాలనే డిమాండ్లను సాధించుకునే వరకు పట్టుసడలని వాతావరణాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో సుమారు 20 లక్షల మంది కార్మికులను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కార్మిక నాయకత్వంపై ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి కార్పొ రేట్లకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుని, లక్షల కోట్ల రూపాయలను రైటాఫ్ చేయడం ఏమిటనే ప్రశ్న పెద్దఎత్తున వినిపిస్తోంది. వేళ్ల మీద లెక్కించదగిన కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలతో దోచిపెట్టడంపై ఉన్న శ్రద్ధ, కోట్లాది మంది కార్మికుల ఆరోగ్యం, వారి న్యాయమైన హక్కులను కాపాడాలన్న స్పృహ కొరవడడం విస్మయాన్ని కలిగిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, దశాబ్దాల తరబడి రూ.12 వేల నుంచి రూ.18 వేల లోపు అరకొర వేతనాలతో కుటుంబాలను గడుపడం ఎంత కష్టమో పాలకులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఉద్యమాలు ఎగిసి పడుతూనే ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రభుత్వం అట్టహాసంగా పేరెంట్ మీటింగ్ నిర్వహించడం వరకు బాగానే ఉంది. కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఫీజుల దోపిడీ దృష్టి సారిస్తే ప్రజోపయోగం ఉంటుంది. పాఠశాల, కళాశాల విద్య, తల్లిదండ్రులు, గురువుల సహకారం పేరుతో మొక్కుబడి తంతును నిర్వహించడం ద్వారా సామాన్యులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని గ్రహించాలి. పాఠశాలలు తెరుచుకునే సమయంలోనే తల్లికి వందనం డబ్బులు జమచేయడం ద్వారా ప్రభుత్వ స్కూళ్ల నుంచి పిల్లలను ప్రయివేటు స్కూళ్లకు తరలించడానికి ఉపయోగపడుతోందనే వాదన వినిపిస్తోంది. అకడమిక్ అడ్మిషన్లకు ముందుగానీ, అడ్మిషన్లు గడువు ముగిసిన అనంతరం తల్లికి వందనం డబ్బులు జమ చేసి ఉంటే బాగుం టుందేమో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనర్హులుగా మిగిలిపోయిన వారి పరిస్థితి ఏమిటో ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశం ఊరి స్తూనే ఉంది. సున్నపురాళ్లపల్లి -పెద్దదండ్లూరు సమీపంలో శంకుస్థాపన చేసిన తర్వాత భూముల పరిశీలన చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. అన్ని చూసిన తర్వాతే కదా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టింది. ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో, ఎంత సమయంలో పూర్తి చేస్తారో, ఎంత ఉత్పాదకత పరిమాణం, ఉపాధి అవకాశాల గురించి చెప్పాల్సిన అవసరం ఉంది. జెఎస్‌డబ్ల్యు సంస్థ అధి కారులతో కలిసి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పరిశీలన చేయడం ఏమిటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని టిడిపి, జనసేన నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు టిడిపి, జనసేన ఎంపీల మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో సీమ ప్రజలు ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి పార్టీలపై ఆధారపడి ఉంది. లేనిపక్షంలో భవిష్యత్ తరాలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్రంలో సంక్షేమ పాలన సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని మండల టిడిపి గాలివీటి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు, హసనాపురం, పంచాయతీలలో 48,65 బూత్ లెవెల్లో శనివారం చంద్రబాబు 4.1 సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని ఐటిడిపి ఛాంపియన్ నాగభూషణ్ రెడ్డిలతో కలిసి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంపు, దివ్యాంగులకు తల్లికి వందనం కింద రూ.15వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని మై టిడిపి యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదర్శన్ రెడ్డి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ, ఐటిడిపి సభ్యుడు గణేష్, యూనిట్ ఇన్‌ఛార్జి ఓబులేసు, బసిరెడ్డి, రవి శంకర్ రెడ్డి, గంగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, పాల్గొన్నారు.

టిడిపి జెండా మోసిన వారికే పదవులు ఇవ్వాలి :'కస్తూరి'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు నియోజకవర్గంలో టిడిపి జెండా మోసిన వారికే పదవులు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవ్‌తో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు కోరారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో కస్తూరి, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కెకెచౌదరి, టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ తదితరులు భేటీ అయ్యారు.ప్రత్యేకంగా నియోజకవర్గం లోని పలు సమస్యల గురించి, జరుగుతున్న పరిణామాల గురించి చర్చించిన కస్తూరి బృందం వివరించారు.ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో పార్టీ కొరకు నిరంతరం ఎవరెవరు కష్టపడ్డారో, ఎవరెవరు పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారో, పార్టీ ఆదేశించినటువంటి ప్రతి కార్యక్రమాన్ని తూచా తప్పకుండా నిస్వార్థంగా పనిచేశారో నాకు అన్నీ తెలుసునని అన్నారు. కానీ ఇప్పుడు మా నియోజకవర్గంలో కష్టపడ్డ వారికి లేకుండా టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి స్వార్థం కోసం కొత్తగా వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం జరుగుతోందని అన్నారు. అనంతరం పల్లా శ్రీనివాస్ కస్తూరి బృందంతో మీరు చెప్పినట్లే అన్ని కమిటీలు పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యతనిస్తామని హామీనిచ్చారని అన్నారు. నియోజకవర్గ కమిటీలను సిఎం చంద్రబాబుతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి నాయుడోరి రమణ, లాయర్ రెడ్డయ్య, లారీ సుబ్బరాయుడు, గల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు తగదు

-ఎన్ఆర్ఐ కాంచన రెడ్డి శేఖర్

ప్రజాశక్తి-సుండుపల్లి

రాజంపేట నియోజకవర్గంలో ఒక సామాన్య టిడిపి కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు మీద అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారని ఎన్ఆర్ఐ కాంచన రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు అనుచరులు గత రెండు నెలల్లోనే టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు బత్యాల చెంగల్ రాయుడు అనుచరులు, ఎన్ఆర్ఐ కార్యకర్తనైన తనపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గం లో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర నాయకులు మీదే కేసులు కట్టి టిడిపి పార్టీని నాశనం చేస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతున్న కూడా టిడిపి అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై టిడిపి కార్యకర్తలు అసహనానికి గురవుతున్నారని అన్నారు. ఇలా జరిగితే రాజంపేట నియోజకవర్గంలో టిడిపి పార్టీ జెండా ఎగరవేయడానికి కార్యకర్తలు కూడా ముందుకు రావాలంటే భయపడే పరిస్థితి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం నిజమైన కార్యకర్తలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-సుండుపల్లి


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న జెసిబి

ప్రభుత్వ స్థలం ఆక్రమించి అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాన్ని కోర్టు ఆదేశాల మేరకు తొలగించినట్లు తహశీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. మండలం బుర్రలదిన్నె పల్లి గ్రామంలో దక్షిణ భాగాన సర్వే నెంబర్ 395లో ఉన్న రహదారిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని అన్నారు. వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి కావడంతో కొన్ని నెలల క్రితం ప్రజలు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ మేరకు అక్రమ నిర్మాణం తొలగించాలని కోర్టు ఆదేశించిందని తహసీల్దార్ తెలిపారు.

హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మించండి

నిరసనలో జనుపువారిపల్లె రైతులు


నిరసన తెలుపుతున్న జనుపువారిపల్లె రైతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పొలాలకు గ్రామానికి మధ్యలో హంద్రీ-నీవా కాలువ రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలువపై వంతెన నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని హంద్రీ-నీవా కాలువ వద్ద శనివారం జనుపువారిపల్లె రైతులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జనుపువారిపల్లెకి చెందిన ఎం.శ్రీరాములు ఆర్.నారాయణస్వామి తదితర రైతులు మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువకు పడమర భాగమున తమ వ్యవసాయ పొలాలు ఉన్నాయని, పొలం పనులు చేసుకునేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. భూములకు మధ్య వంతెన నిర్మాణం కొరకు గతంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఇంతవరకు ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో దాదాపు 15 మంది రైతులకు కాలువ అటువైపున వ్యవసాయ భూములు సుమారు 50 ఎకరాలు ఉన్నాయని, అందులో వున్న వ్యవసాయ బోర్ల ద్వారా వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామని అన్నారు. తమ నివాస గ్రామం నుంచి అక్కడికి వెళ్ళాలంటే టి.సదుం క్రాస్ ద్వారా చుట్టూ 4 కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు సాగు చేయుటకు, పశువులు, గొర్రెలు, మేకలు సదరు వ్యవసాయ భూములలోకి తోలుకెళ్లడానికి దారి లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హంద్రీ - నీవా కాలువ మీద వంతెన నిర్మించి వ్యవసాయం చేసుకొని జీవనం సాగించడానికి వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బిసి వసతి గృహంలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట


వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ జయశ్రీ

మండల పరిధిలోని బిసి బాలుర, బాలికల వసతి గృహాన్ని ఎంపిడిఒ జయశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర , బాలికల వసతి గృహంలో ఉన్న ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులను పరిశీలించడం జరిగింది. రాత్రి సమయంలో వసతి గృహంలో వడ్డించే ఆహారాన్ని పరిశీలించడం జరిగింది. మరుగుదొడ్లను, వంటగదిని, స్టోర్ రూమును గదులను పరిశీలించారు. హాస్టల్ ఆవరణలో చెట్లు విరివిగా ఉండడం గమనించిన ఎంపిడిఒ యాజమాన్యం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయానికి భోజనం చేసి పాఠశాలకు వెళ్లి చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ తిరుమలరెడ్డి, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తాం

-ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి


ఎల్లమ్మ ప్రతిమ

మండల కేంద్రం కలికిరిలో కొలువైన ఎల్లమ్మ దేవత ఉత్సవాలను ప్రతి ఆషాఢ మాసంలో శుక్ల ఏకాదశి శనివారం నుంచి ప్రారంభ మయ్యాయని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌రెడ్డి తెలిపారు. ఉదయం వివిధ సాంప్రదాయ కార్యక్రమాలు పూర్తి చేసుకుని రాత్రి జాగరణ, అమ్మవారి కథాకాలక్షేపం జరిగింది. ఆదివారం ఉదయం అమ్మ వారు ప్రత్యేక రథంలో గ్రామ పర్యటన చేయనున్నారు. తరువాత సిద్దపూజ, సాయంకాలం బోనాలు, రాత్రి విశేష అలంకారాలతో రంగురంగుల విద్యుద్దీపాలతో చాందినీ బండ్లు ఈ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. సోమవారం ఉదయం నుంచి సర్వ దర్శనం, సాయంత్రం పుష్పపల్లకి, లంకాదహనం, మంగళవారం ఉదయం పార్వేట ఉత్సవం, సాయంత్రం కల్లిపాటుతో అమ్మవారి జాతర ఘనంగా ముగుస్తుంది. ఎల్లమ్మ చరిత్ర ప్రకారం కలికిరి చెరువు ముందరపల్లి లోని కొందరు జంగములు ముత్యాలు, పగడాలు, విలువైన రాళ్లు తీసుకొని కర్ణాటక రాష్ట్రం ధార్వాడ జిల్లాలో వ్యాపారం ముగించి అదే జిల్లాలో ఉన్న శివాలయంలో బస చేస్తారని అన్నారు. శివయ్య అనే వ్యక్తి సంచి బరువుగా తోచి కిందికి దించి చూడగా నాలుగైదు కిలోల బరువున్న గుండ్రాయిని బయటకు తీస్తూ తమను ఎవరో ఆటపట్టించడానికి తన సంచిలో రాయిని వేశారని అనుకోని ఆ గుండ్రాయిని అక్కడే విసిరేసి తిరుగు ప్రయాణం సాగించగా మళ్లీ తిరిగి అతని సంచిలోకి గుండ్రాయి రూపంలో అమ్మవారి ప్రతిమ కనబడుతుందన్నారు. కలికిరి పట్టణంలోని బంగారు పిచ్చుక అనే పిలవబడే దానగుణం కలిగిన దివంగత సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డి ముత్తాత రెడ్డివారి గంగిరెడ్డి గ్రామ ప్రజలతో కలిసి కలికిరికి దక్షిణాన సరిహద్దులోని తన పొలంలో ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించారని అన్నారు. అప్పటినుంచి పట్టణంలోప్రతి యేటా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు వేలమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

శరవేగంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఎపిఎస్‌ఆర్‌టిసి బస్ స్టేషన్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని రెండవ డిపో మేనేజర్ అమరనాథ్ తెలిపారు. ఫ్లాట్ ఫామ్‌లు, వాటి వెనుక ఉన్న పార్కింగ్ మూవింగ్ ఏరియాలో సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్‌ను వేస్తున్నట్లు తెలిపారు. క్రమంగా బస్సుల రాకపోకలను నియంత్రిస్తూ దశల వారీగా బస్ స్టేషన్ ప్రాంగణం మొత్తం సిమెంట్ ఫ్లోరింగ్ వేయడం జరుగుతుందన్నారు. కాంక్రీంట్ పనులు జరుగుతున్న దృష్ట్యా కొన్ని సెక్టార్లలో తిరిగే బస్సులు తూర్పు మార్గం నుండి వచ్చి వెళ్లే విధంగాను, మరికొన్ని ప్రాంతాలకు వెళ్లే బస్సులు పశ్చిమ గేట్ నుండి వచ్చి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడం జరుగిందన్నారు. బస్ స్టేషన్‌లో తూర్పువైపున తిరుపతి, పీలేరు, నిమ్మనపల్లి, రామసముద్రం, వాల్మీకిపురం, కలకడ ప్రాంతాలకు వెళ్ల బస్సులు ఆగుతాయని అన్నారు. పడమర వైపున బెంగుళూరు, కడప, కదిరి, అనంతపురం, తంబళ్లపల్లి, బి.కొత్తకోట, గుర్రంకొండ, రామచోటి, గాలివీడు ప్రాంతాలకు వెళ్లబస్సులు ఆగుతాయన్నారు. మరమ్మతు పనులు ఒక నెలలో పూర్తి అవుతాయని అప్పటి వరకు ప్రమాణికులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

ఇండియన్ ముస్లిం నూర్ బాష్ (దూదేకుల) కులానికి ప్రభుత్వ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని నూర్‌బాష్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిడాల సిద్ధయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పద్మావతి నగర్‌లోని ఎమరాల్డ్ కోచింగ్ సెంటర్లో పీలేరు నియోజకవర్గంలోని నూర్ బాష్ (దూదేకుల) ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ దూదేకుల కుల ఐక్యత, సంస్కృతి, సాంప్రదాయాలు, నూర్ బాష్ (దూదేకుల) ఎంప్లాయిస్ సంక్షేమం గురించి వివరించారు. నూర్ బాష్ (దూదేకుల) వర్గానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కుల దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించాలని అన్నారు. ఇండియన్ ఇస్లాం దూదేకులుగా శాశ్వత ప్రభుత్వ జిఒ ఇవ్వాలని, దూదేకుల కులాలకు ప్రభుత్వ సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, మైనార్టీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు డివిజన్ నూర్ బాష్ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పసుపులేటి రహమత్ బాషా, ప్రధాన కార్యదర్శిగా వెంకిపల్లి మహమ్మద్‌రఫీ, కోశాధికారిగా పి.ఖాదర్‌వల్లి, ఉపాధ్యక్షులుగా కాసల హనీఫ్, కార్యదర్శులుగా పసుపులేటి నజీర్, వజ్రాల అల్తాఫ్, సి.ఖాదర్‌వల్లి, ఎన్.చిన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ వేంపల్లి అబ్దుల్‌ఖాదర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నూర్‌బాష్ సభ్యులు, పసుపులేటి రెడ్డిబాష, కాసల ఫరీద్, కాసల ఆ మునాఫ్, ఖాజా పీర్, హుస్సేన్ బాష, షాహిద్ పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి


సన్మానం పొందిన ఉపాధ్యాయులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో పట్టణంలోని సాయి శుభ కల్యాణ మండపంలో గురు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివన్న బాలాజీ, జిల్లా అధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవని వృత్తి అయిన ఉపాధ్యాయులను ఘనం గా సన్మానించారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను ఆపస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గుర్తించి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ప్రభుత్వంతో మాట్లాడే అవకాశం కూడా లేదున్నారు. కానీ మా ప్రభుత్వం ఫ్రెండ్లీ నేచర్‌తో వ్యవహరిస్తూ, వారి సమస్యలను వినడమే కాకుండా పరిష్కరిస్తోందన్నారు. గురువులు సమ సమాజ రూపకర్తలు సమాజం గురువుల పట్ల ఎప్పటికీ రుణపడి ఉంటుంది అని తెలిపారు. డిఇఒ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గురువు సమాజంలో అత్యున్నత స్థానం కలిగినవాడు తరం తీర్చిదిద్దే దైవస్వరూపులు గురువులే వారి సేవను గుర్తించి గౌరవించడమే సమాజ అభివృద్ధికి దారి తీసే మార్గం అని పేర్కొన్నారు. కార్య క్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర రావు, రాష్ట్ర మీడియా ఇంచార్జి రెడ్డి రాజే శ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు పరశురామ్, ఆంజనేయులు జిల్లా సహాధ్యక్షులు జి.నాగేంద్రబాబు, రామాం జనేయ రెడ్డి, జిల్లా కార్యదర్శులు బాలాజి ,శ్రీనివాసులు దుళ్ళ వారి పల్లె శ్రీని వాసులు పలువురు ఉపాధ్యాయులు, ఆపస్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆరోగ్యవంతులు రక్తదానం చేసి పలువురిని బతికించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ లో కడప జిల్లా స్వచ్ఛంద సేవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు వారం రోజులు పాటు కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్ లో రక్త నిల్వలు చాలా తక్కువ ఉన్నాయని తెలిపారు. కావున 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యకరంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు రావాలన్నారు. రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ యశస్వి మాట్లాడుతూ ఏ ప్రయోగశాలలోనూ తయారు అవ్వనిది రక్తం మాత్రమే అన్నారు. అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరని తెలిపారు. కార్యక్రమంలో శివాంజనేయ, విజయ్ కుమార్, తారిఖ్, సుబ్బారావు, ఓబయ్య, గురు కిరణ్ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదు

ప్రజాశక్తి - కడప : ప్రజల సమస్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరి కాదని కాంగ్రెస్ పార్టీ యువ నేత మధు రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పనితీరుపై ఈ సందర్భంగా మధు రెడ్డి తీవ్రంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పరిస్థితి అంతంత మాత్రం ఉన్నప్పుడు యువత, సీనియర్ కార్యకర్తలు పార్టీని ముందుకు నడిపించారన్నారు. 2024 ఎన్నికల్లో కూడా యువత వారి భవిష్యత్తును పక్కన పెట్టి ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని ముందుండి పార్టీని నడిపించారన్నారు. కొత్తగా వచ్చిన డిసిసి, కో- ఆర్డినేటర్లు ఏ కార్యక్రమాలు చేయరన్నారు.

క్రైం కార్నర్


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు : ఎఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను వీరబల్లి మండల పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.10.75 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎఎస్‌పి వెంకటాద్రి రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా గూడూరు టౌన్‌కు చెందిన రంగనాథం కిరణ్ బేకరీ పని చేస్తూ ఉండేవాడని తెలిపారు. జల్సాలకు, ఈజీమనీకి, తాగుడు, జూదానికి అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడని తెలిపారు. అధిక మొత్తంలో సులభంగా డబ్బులు సంపాదించాలని భావించి పగలు, రాత్రి వేళల్లో ఇంట్లో ఎవరూ లేని ఇళ్లను గుర్తించి దొంగతనాలు, బస్టాండ్, జనాలు రద్దీగా ఉండే ప్రదేశాలలో జేబు దొంగతనాలు చేస్తూ ఉండేవాడని తెలిపారు. నిందితుడిపై శ్రీపొట్టి శ్రీరాములు, విశాఖపట్నం, ఎన్టీఆర్, కృష్ణ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, ఏలూరు, కాకినాడ జిల్లాలలో 54 కేసులు ఉన్నాయని అన్నారు. అన్నమయ్య జిల్లాలో ఆరు కేసులు నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో వీరబల్లి మండలం బోధి వీడు గ్రామం క్రాస్ వద్ద రంగనాథం కిరణ్‌ను అదుపులో తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతడిపై 60 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి 102 గ్రాముల బంగారం, రూ.75 వేల నగదు, మొత్తం రూ.10.75 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన రాయచోటి రూరల్ సిఐ వరప్రసాద్, సిసిఎస్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐలు రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి సిబ్బందిని అభినందించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న 9వ తరగతి చదువుతున్న రేష్మ గత మూడు రోజులుగా ఇంటికి రాలేదని తల్లి రజియా శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని హెచ్ఎంఎం ఉన్నత పాఠశాలలో చదువుతున్న రేష్మ మూడు రోజుల క్రితం స్కూలుకు వెళ్ళిందని ఆ రోజు నుంచి ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంటి వద్ద పలుచోట్ల వెతికి ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని దిన్నెపాడు సమీపంలోని దిన్నెపాడు ఎర్రం రెడ్డిగారి పల్లి వద్ద విద్యుత్ లైన్ సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి ఝార్ఖండ్‌కు చెందిన రాబిన్ బంద్ర అనే వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. ఝార్ఖండ్ నుంచి కొంతమంది విద్యుత్ లైన్ పనులకు రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండల ంలో పనిచేస్తున్నారు. కాంట్రాక్టర్ వద్ద కూలిగా పనిచేస్తున్న రాబిన్ బంద్ర అనే యువకుడు విద్యుత్ వైర్లు సరిదిద్దుతుండగా ప్రమాదవశాత్తు వైర్ తగిలి విద్యుత్ విద్యుదాఘాతానికి గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. హుటాహుటినా లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందిన వైద్యులు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని ఉంచారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆవు పొడిచి మహిళ..

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని గద్దగుండ్లరాచ పల్లెకు చెందిన సుజాతమ్మ (45) అనే మహిళ శనివారం ఆవు పొడవంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుజాతమ్మ జెర్సీ ఆవులు మేపుకుంటూ పాలు పిత్తుకొని జీవనం సాగించేదని తెలిపారు. రోజు ప్రకారమే శనివారం ఉదయాన్నే అవుల మేపు కోసం వదిలి వాటి కాపలా కాస్తుండగా అదే ప్రాంతంలో వేరే రైతు ఆవులు అక్కడ వస్తూనే ఆమెను కొమ్ములతో పొడిచి కింద పడేశాయని తెలిపారు. వెంటనే గమనించిన పశువుల కాపరులు ఆమెను రాయచోటిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో గొడవపడిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. స్థానిక బుగ్గ కాలువ ప్రాంతానికి చెందిన తేజ్‌కుమార్ కుటుంబ సమస్యలపై తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. వారు తీవ్రంగా మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు బాధితున్ని వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు విచారిస్తున్నారు.

ఆస్తిలో వాటా అడిగినందుకు కారుతో హత్యాయత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని విక్రయించగా వచ్చిన సొమ్ములో తనకు రావాల్సిన వాటా అడిగినందుకు అక్క భర్త కారుతో హత్య చేసేందుకు ప్రయత్నించాడని పిటిఎం మండలం, సంపతికోట పంచాయతీ, కానగమాకులపల్లెలో నివాసముండే పోతుపేట వెంకటేష్ సతీమణి పి.కవిత శుక్రవారం బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రికి తనతోపాటు మరో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని అందరికీ వివాహాలు జరిగి వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారని అన్నారు. మా పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్తి మాతండ్రి పేరుపైన ఉండేదని ఇప్పుడు ఆ భూమిని విక్రయించి ముగ్గురి ఆడపిల్లలకు ఎవరి వాటాలు వారికి సమానంగా ఇవ్వాలని మా తండ్రి నిర్ణయించుకున్నారని అన్నారు. పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం విక్రయించిన వాటిలో తన సొమ్మును ఇవ్వాలని నా తండ్రిని కోరగా నా అక్క భర్త అయిన ఆర్.రెడ్డి శేఖర్ జోక్యం చేసుకొని ఇచ్చేది లేదని దుర్భాషలాడారని అన్నారు. మేము అందుకు అంగీకరించ కపోవడంతో ఆగ్రహానికి గురై తన కారుతో నా భర్త అయిన వెంకటేష్‌ని ఢీకొట్టడంతో వెన్నెముక, చేతికి తీవ్ర గాయాల య్యాయని అన్నారు. అంతటితో ఆగకుండా తనపైకి కారు ఎక్కించే ప్రయ త్నం చేశారని, కారు తగిలి తాను కింద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక వైద్యులు సూచనలు మేరకు తిరుపతిలో చికిత్స చేయించుకుంటున్నట్లు ఆమె తెలిపారు.పోలీసులు రెడ్డిశేఖర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆస్తిలో తమ వాటా మాకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారి చిన్నఓరంపాడు పరిసరాలలో ఉన్న నాయుడు డాబా దగ్గర వ్యవసాయ పనులు చేసుకునే వ్యక్తి భోజనానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదానికి గురయ్యాడని ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు. వివరాల్లోకెళితే కడపజిల్లా, చెన్నూరు ప్రాంతానికి చెందిన శీను అనే వ్యక్తి తమలపాకు తోటల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఈ ప్రమాదంలో శీను అనే వ్యక్తి కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. క్షతగాత్రుడిని 108 ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్‌నాయుడు తెలిపారు.